


# కరపత్రం

SINCE 2014

బుధవారం నవంబర్ 26 2025 | సంపుటి : 2 | సంచిక : 52 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

» రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి

» ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం

» ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి

» అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ

**అయోధ్య,నవంబర్25 :**
భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిం చారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం,




సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్దాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు.

## జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ

# ఓఆర్ఆర్ లోపలా, బయట ఉన్న మున్సిపాలిటీల విలీనం

» మొత్తం 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం

» కొత్తగా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు నిర్ణయం

» ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు

» పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడులకు ఆహ్వానం

» తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు




**హైదరాబాద్,నవంబర్25 :**
జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్నా 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను డిప్యూటి సిఎం,మంత్రి శ్రీధర్‌బాబు,జూపల్లి కృష్ణారావులు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో హైదరాబాద్ పరిధి మరింత పెరుగుతందన్నారు. అంతేకాకుండా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలుకు కేబినెట్ ఆమోదించింది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానించాలన ఇనిర్ణయించారు. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వనున్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



**వేములవాడ,నవంబర్25 :**
ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి వేములవాడ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంగళవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గరీమ అగర్వాల్, పార్టీ నేతలతో కలిసి గృహ సముదాయం వద్ద బేస్‌మెంట్‌పై నిల్చొని పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా అది కుంగింది. ఈ ఘటనతో అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ నేతలు.. ఆది శ్రీనివాస్ కింద పడిపోకుండా పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది.



## ఛత్తీస్‌గఢ్‌లో 28 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల:**
ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్ నారాయణ్‌పుర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో మాడ్ డివిజన్ కమిటీ సభ్యులు, పీఎల్‌జీఏ, ఏరియా కమిటీ సభ్యులు, మిలటరీ దళం కమాండర్, ఎల్‌ఓఎస్, జనతం సర్కార్ సభ్యులు ఉన్నారు. దండకారణ్యంలో కీలకంగా వ్యవహరించిన వీరిపై రూ.89 లక్షల రివార్డు ఉన్నట్లు ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు బస్తర్ డివిజన్‌లో 287 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు.




## నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

» 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ


» రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతున్న సిఎం రేవంత్

» రాత్రికి రాత్రే బిలియనీర్ కావాలన్న

» లక్ష్యంతో కదుపుతున్న పావులు

» బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,నవంబర్25 :**
సిఎం రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు.




## మోగిన స్థానిక ఎన్నికల నగారా

» మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ

» డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్

» అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

» రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి

**హైదరాబాద్,నవంబర్25 :**
తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు.

## చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

◆ లోతైన దర్యాప్తు జరిపించాలన్న బండి

◆ సిఎం రేవంత్ రెడ్డికి లేఖ




**హైదరాబాద్,నవంబర్25 :**
తెలంగాణలో చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై అనుమానాలున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. వీటిపై విచారణ జరగాలని అన్నారు. ఎందుకు ఇలా జరుగుతున్నా యో తేల్చాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై కట్టిన చెక్ డ్యామ్‌లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.




## చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే

⊙ గుంపుల వద్ద డ్యామ్‌ను పరిశీలించిన హరీష్ రావు




## జీహెచ్ఎంసీ విస్తరణకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం

**హైదరాబాద్:**
జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం నవంబర్ 26 2025

# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

మొదటి పేజీ తరువాయి

కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

# చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే

మొదటి పేజీ తరువాయి

కెసిఆర్ హయాంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ ఎవరు కట్టారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల వద్ద పేల్చిన చెక్ డ్యామ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కూల్చివేసింది కాంగ్రెస్ నేతలేనన్నారు. కాంగ్రెస్ హయంలో చెరువులు, చెక్ డ్యామ్‌ల పేల్చివేత నిత్య చర్యగా మారిందన్నారు. గతంలో పెద్దపల్లి భోజన్న పేట వద్ద హుస్సేన్ మియావాగుపై కూడా చెక్ డ్యామ్ పేల్చివేశారని ఆరోపించారు. గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూడా కులలేదని.. పేల్చారని ఇక్కడి రైతులే చెప్తున్నారన్నారు. ఇసుక మాఫియానే కూల్చివేసిందని, కాంగ్రెస్ పాలనలో వేల కొద్ది లారీల్లో ఇసుక తరలిస్తున్నారన్నారు. రాత్రికి రాత్రి చెక్ డ్యామ్ పేల్చేశారని.. భోజన్నపేటలో హుస్సేన్ మియావాగుపై చెక్ డ్యామ్ పేల్చివేస్తుంటే రైతులే పట్టుకున్నారన్నారు. అప్పుడు రైతులే కేసులు పెట్టారని.. పోలీసులు ఇప్పటివరకు దోషులను పట్టుకోలేదని ఆరోపించారు. తాజాగా మరో చెక్ డ్యామ్ పేల్చారని.. అప్పుడే పోలీసులు దోషులను శిక్షిస్తే.. ఈ రోజు గుంపుల చెక్ డ్యామ్‌కు ఈ పరిస్థితి రాకుండేదన్నారు. ఈరోజు వరకు పోలీసులు వాళ్లను పట్టుకోలేదని.. మూడు రోజులు అయిన ఇక్కడి పేల్చవేత దోషులను పోలీసులు పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లను కాపాడుతుందని.. ఆనాడు గుండాలను అరెస్ట్ చేస్తే ఈ రోజు ఇక్కడి చెక్ డ్యామ్ పేల్చకపోయేవాళ్లని.. హైదరాబాద్‌లో ఇండ్లు, ఇక్కడ చెరువులు, చెక్ డ్యామ్‌లు కూలగొడుతున్నారన్నారు.
కేసీఆర్ కట్టుడు.. కాంగ్రెసోళ్ల కూలగొట్టుడని.. మానేరు నది మీద చెక్ డ్యామ్‌లు కట్టి సస్యశ్యామలం చేశామన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కట్టిందని.. చర్యలు తీసుకోవాలంటే పొంగులేటిపై తీసుకోవాలన్నారు. రాఘవ కంపెనీని బ్లాక్ చేయాలన్నారు. పొంగులేటి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 6 లక్షల ఎకరాలు నీళ్లు ఇస్తామని ఉత్తమ్ కుమార్ చెప్పిండని.. ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని.. రెండేళ్లు అయిన కాళేశ్వరం రిపేర్ చేయడం లేదని.. కాళేశ్వరం కింద ఉన్న కాలువలు తవ్వడం లేదన్నారు. కాలువలు తవ్వితే కేసీఆర్‌కు పేరు వస్తుందని రైతును గోసపెడుతున్నారన్నారు. కాళేశ్వరం కూలిందని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకుపోతున్న నీళ్లు కాళేశ్వరంవికావా అంటూ ప్రశ్నించారు. ఈ బ్లాస్టింగ్స్ చూస్తే కాళేశ్వరం కూడా పేల్చారని అనుమానం వస్తుందన్నారు. పెద్దపల్లిలో జిలిటెన్ స్టిక్స్‌తో కాంగ్రెస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని.. ఇసుక మాఫియాతో రూ.24 కోట్లు రికవరీ చేయాలన్నారు. ఎండాకాలం లోపే చెక్ డ్యామ్ నిర్మించాలని.. ఇసుక మాఫియాలో మంత్రుల వాటా ఉందని.. రాత్రిపూట పెద్దశబ్దం వినపడిందని అని మత్స్యకారులు చెప్తున్నారన్నారు. లక్ష క్యూసెక్కుల వరద వస్తే కూడా ఈ చెక్ డ్యామ్ చెక్కు చెదరలేదన్నారు. కూలితే రాత్రే ఎందుకు కూలింది? కూలలేదు కూల్చారు అంటూ ఆరోపించారు. కాంగ్రెస్‌కు రైతుల కన్నా ఇసుక మాఫియా ముఖ్యమన్నారు. టెర్రరిస్టులు కూడా ఇలాంటి పనులు చేయరని, టెర్రరిస్టులకు మించిపోయారని.. ఇసుక మాఫియా దోషులను శిక్షించకుంటే రాష్ట్రంలో మరిన్ని చెక్ డ్యామ్‌లు పేలుస్తారన్నారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్ర రైతుల నోట్లో మట్టికొడుతున్నారని.. కాళేశ్వరం కూలిందని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. కాళేశ్వరంలో భాగంగా కట్టిన మల్లన్న సాగర్ నుంచి రూ.8వేల కోట్లతో హైదరాబాద్‌కు పైపులైన్ వేస్తా అంటున్నాడన్న హరీశ్‌రావు.. మల్లన్న సాగర్ ఎవరు కట్టారు నీ తాత కట్టిండా..? కేసీఆర్ కాదా? అంటూ ప్రశ్నించారు. ఇసుక మాఫియాపై ఉన్నత స్థాయి విచారణ జరగాల్సిందేనన్నారు. నిందితులు ఎవరైనా వారి నుంచి రూ.24కోట్లు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# మలక్కా ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతం
# మరో వాయుగుండం ఏర్పడే అవకాశం

**– రెండు అల్పపీడనాలతో భారీ వర్షాలకు ఛాన్స్**

బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంపై మరోసారి వరణుడు తన ప్రతాపం చూపనున్నాడు. ఈనెలాఖరున రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాగల 6 గంటల్లో ఇది పశ్చిమ – వాయవ్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తదుపరి 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఉపరితల ఆవర్తన ప్రభావంతో కొమోరిన్, నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసర ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఇప్పటికే కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పింది. రాబోయే 24 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు... పలు చోట్ల భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో రైతులకు కూడా వాతావరణ అధికారులు కీలక సూచనలు చేశారు. మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. అయితే తుఫాన్ తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళుతుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.
కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనడపతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

# 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి
# ఉగాదిలోగా మరో అయిదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం

**– మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడి**

నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళ్లు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్ధసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు. గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు. 8 లక్షల ఇళ్లు శాంక్షన్ అయితే 30 శాతం మాత్రమే పూర్తి చేశారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ తీసుకున్న రాక్రీట్ నిర్మాణ సంస్థ.. స్కీంకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. 47 వేల 850 ఇళ్లు తీసుకుని నిర్మిస్తామని చెప్పి ఎక్కడా పూర్తి చేయలేదన్నారు. 80 కోట్ల రూపాయలు అవకతవకలు చేశారని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. రాక్రీట్ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇప్పటికైనా ఆప్షన్ 3లో పేమెంట్ కింద చివరి దశలో ఉన్న నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి కొలుసు పార్ధసారథి వెల్లడించారు.

## జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ

మొదటి పేజీ తరువాయి

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం కేబినేట్ ఆమోదించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపునకు ఆమోదించారు. అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు.

## మోగిన స్థానిక ఎన్నికల నగారా

మొదటి పేజీ తరువాయి

రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

## నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు. దాదాపు 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నారని కేటీఆర్ తెలిపారు. దాదాపు ఆ భూములన్నింటికీ రేవంత్ సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. లక్షన్నర గజం విలువ చేసే భూమికి 10 వేలు కడితే చాలని పాలసీ తెచ్చారని తెలిపారు. పారిశ్రామిక వాడల భూములను అమ్మి 4-5లక్షల కోట్ల కుంభకోణం చేయాలని చూస్తున్నాడని అన్నారు. అంబానీ, అదానీలను ఒకే దెబ్బకు క్రాస్ చేయాలని రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మనుమలు, మునిమలు కూర్చొని తిన్నా కూడా అరిగిపోని ఆస్తిని వెనకేసుకోవాలని ఈ స్కామ్‌కు తెరతీశాడని చెప్పారు.
50-60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని తెలిపారు. మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీలు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అందుకే మేం గ్రిడ్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. గతంలో 50 శాతం ఐటీ ఆఫీసులకు, 50 శాతం ఇతర అవసరాల కోసం ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టినంకనే అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ధారాదత్తం చేస్తోందని అన్నారు. భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై కౌన్సిల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నిలదీశారని కేటీఆర్ గుర్తుచేశారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు కోర్టు ఆపింది.. మిగతావి ఎవరు ఆపారని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికీ న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ముస్లింలకు 4 వేల కోట్లు బడ్జెట్‌లో పెడతామని.. పెట్టలేదని మండిపడ్డారు.తెలంగాణపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని కేటీఆర్ అన్నారు. తెచ్చిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థి రణభేరీ మోగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాయకులు సమాజం నుంచి వస్తారు.. నాయకుల చుట్టూ తిరిగితే నాయకులు కారని వ్యాఖ్యానించారు.

## చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

మొదటి పేజీ తరువాయి

తనుగుల– గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూలడమే ఇందుకు నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ పాలనతో కమిషన్లకు కక్కుర్తి పడి నాణ్యతను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చెక్ డ్యామ్‌లను నిర్మించిన కాంట్రాక్టర్లు కాంగ్రెస్ వాళ్లేనని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపులపై మీరు ఆదేశించిన విజిలెన్స్ విచారణ ఏమైందని బండి ప్రశ్నించారు. ఆనాడు బాధ్యులపై చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే తనుగుల–గుంపుల చెక్ డ్యామ్ కూలేది కాదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ డ్రామాలాడుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెక్ డ్యామ్‌ల నిర్మాణాల్లో అక్రమాలు, కూలిపోవడంపై విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులు జప్తు చేసి ఆ సొమ్ముతోనే మళ్లీ డ్యామ్‌లు నిర్మించాలని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.ం

## జీహెచ్ఎంసీ విస్తరణకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రి శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.
అంతేకాకుండా మరో డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

### క్యాబినెట్ మరిన్ని నిర్ణయాలు

**2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలు**
**పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానం**
**కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి**
**ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం**
**పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన**
**హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు**
**భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీఫైబర్ కేబుళ్ల ఏర్పాటు**
**భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపు**
**ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు**
**జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటు**

# సోషల్ మీడియా బూటకపు ప్రచారంతో
# కాంగ్రెస్ లాభపడుతుందా! బిజెపి నష్టపోతుందా!

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

గత కొంత కాలంగా బిజెపి మోడీ వ్యతిరేక ప్రచారం చేస్తున్నది. ఈ ప్రచారం లో వాస్తవాలు తక్కువ అని విమర్శకుల అభిప్రాయం.కాంగ్రెస్ తో పాటు విపక్షాలు బిజెపి వ్యతిరేక, మోడీ వ్యతిరేక వార్తలు,

వీడియోలు సోషల్ మీడియాలో విపరీత ప్రచారం చేస్తున్నది.

సామాన్యులు ఈ వార్తలు వీడియోలు చూసి మోడీ, బిజెపి ని వ్యతిరేకిస్తారని కాంగ్రెస్ నమ్ముతున్నది.

కానీ బిజెపి అనుకూల సోషల్ మీడియా ఫాక్ట్ చెక్ వివరాలను వెంటనే పోస్ట్ చేస్తూ కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడుతున్నది.

రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రజా క్షేత్రంలో పని మానేసి కేవలం బిజెపి మోడీ వ్యతిరేక ప్రచారాన్ని నమ్ముకుని దెబ్బతింటున్నది.

కాంగ్రెస్ ప్రచార సరళిపై స్వతంత్ర జర్నలిస్ట్ అశ్వినీ కుమార్ పరిశోధనాత్మక ఆర్టికల్ ఇప్పుడు సోషల్ మీడియాలో, ప్రధాన మీడియా అన్నింటా విపరీతంగా సర్క్యులేట్ అవుతున్నది.

ఆ వివరాలు చూద్దాం.




**» కాంగ్రెస్ ప్లాన్**

2020-21లో కాంగ్రెస్ పార్టీ మోడీకి, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి 5 లక్షల మంది 'సోషల్ మీడియా వారియర్స్'ను రిక్రూట్ చేసుకుంటామని ప్రకటించింది.

**» అనూహ్య స్పందన**

కాంగ్రెస్ ఆశించినట్టు ట్విట్టర్ లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టే పోస్టులకు నిమిషాల్లోనే లక్షల్లో వ్యూస్ వస్తున్నట్టు ప్రచారం జరిగింది.

భారత్ లో ఇంతమంది మోదీ వ్యతిరేకులు ఉన్నారా అని అందరూ ఆశ్చర్యపోయేటట్టుగా భ్రమ కల్పించారు.ఈ ప్రచారం లోని డొల్ల తనం వెంటనే బయటపడడం ప్రారంభమయ్యింది.ఈ డొల్ల ప్రచారానికి స్వయంగా ట్విట్టర్ తెర దించింది.

**» ఎలాన్ మస్క్ ట్విస్ట్**

ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్ ఇటీవల ఒక కొత్త ఫీచర్ తీసుకొచ్చారు. దీని వల్ల ఒక అకౌంట్ ఎక్కడి నుండి ఆపరేట్ చేస్తున్నారో, ఆ అకౌంట్ లొకేషన్ ఎక్కడుందో తెలిసిపోతుంది.

**» బయటపడ్డ బండారం**

**ఈ ఫీచర్ వచ్చాక కాంగ్రెస్ బండారం బయట పడింది.**

**ఆ వివరాలు చూస్తే్న కాంగ్రెస్ కు మద్దతుగా పోస్టులు పెడుతున్న వారిలో దాదాపు 80% మంది భారతీయులు కాదని తేలింది**

**» పాకిస్తాన్ కుట్ర**

కాంగ్రెస్ ప్రచారానికి ఆధారంగా పాకిస్తాన్ రంగంలోని దిగింది. ట్విట్టర్ ఫీచర్ ప్రకారం పాకిస్తాన్ కుట్ర మొత్తం వెలుగు చూసింది.

**» దియా శర్మ, తేజస్వి ప్రకాష్, నిధి సింగ్ వంటి హిందూ పేర్లతో అకౌంట్లు క్రియేట్ చేసి, ప్రొఫైల్ లో తెలంగాణ, యూపీ అని పెట్టుకున్నారు. కానీ వారి ఒరిజినల్ లొకేషన్ చూస్తే పాకిస్తాన్, సౌదీ అరేబియా, బంగ్లాదేశ్ అని తేలింది**

**» ఫిఫ్త్ జనరేషన్ వార్**

5th Generation War గా మొదలైన ఈ ప్రచారం భారత్ ను అస్థిర పరిచే ఒక కుట్ర అని తేలింది. పాకిస్తాన్, ఐఎస్ఐ నెట్‌వర్క్ లు భారత్ లో కులాల మధ్య అంతరాలు పెంచేందుకు కుట్ర చేశాయి.

దళితులు vs హిందువుల మధ్య, ప్రాంతాల మధ్య .. నార్త్ vs సౌత్ అంటూ గొడవలు పెట్టడానికి సోషల్ మీడియా ప్రచారం ఊపందుకున్నది.

ఇలా ఫేక్ ఐడీలతో పాకిస్తాన్ తో కలిసి భారత్ లో అస్థిరత రేపడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.

**» కాంగ్రెస్ ప్రచారం ముగింపు కు చేరుకున్నది**

రాజకీయ పోరాటం మరచిపోయిన కాంగ్రెస్ పార్టీ,ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కేవలం సోషల్ మీడియా, ప్రధాన మీడియా ప్రచారంతో బిజెపి మోడీని విమర్శించి లాభపడాలని తప్పటడుగులు వేసింది.

కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో అనుకున్న మద్దతు దొరక్క కాంగ్రెస్ విదేశీ శక్తులపై ఆధారపడిందా అని రాజకీయ పండితులు ఈ వైఖరిని ఈసాదించుకుంటున్నారు.

మన దేశంలో అల్లకల్లోలం రేపడానికి దేశ శత్రువులే కాంగ్రెస్ ను సపోర్ట్ చేస్తున్నారా? అనేది ఆలోచించాల్సిన విషయం అని బలమైన అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**» భారతీయులారా అప్రమత్తంగా ఉండండి**

రాహుల్ గాంధీ అపరిపక్వ పనితీరు దేశానికి హాని చేస్తున్నదని విశ్లేషకులు ఇప్పుడు బహిరంగంగా విమర్శలు చేయడం ప్రారంభమయ్యింది.నిన్న 272 మంది పౌర ప్రముఖులు రాహుల్ గాంధీని విమర్శిస్తూ బహిరంగ లేఖ విడుదల చేసారు.

**» కాంగ్రెస్ బూటకపు పనివిధానం సర్వత్రా విమర్శలకు దారితీసింది. అందుకే..కాంగ్రెస్ పార్టీ అజ్ఞాత పని విధానం చూసి బిజెపి "కాంగ్రెస్ ముక్త భారత్" అని అంటున్నదని భావించాల్సి వస్తున్నది**

**అశ్విని కుమార్,జర్నలిస్ట్ సౌజన్యంతో**

## పోచారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగూడలో 800 గజాల అసైన్డ్ ల్యాండ్ (సర్వే నెం. 866, 867) కబ్జా చేసి, అనుమతి లేకుండా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఓ మాజీ ఎమ్మెల్యే తమకు అమ్మినట్లు బాధితులు ఆరోపించారు. కబ్జాదారులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## సినిమా థియేటర్లలో దోపిడీ




**- PYL ఆందోళన**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

ప్రగతిశీల యువజన సంఘం (PYL) హైదరాబాద్ నగర కమిటీ విద్యానగర్లో సమావేశమైంది. సినిమా థియేటర్లలో తినుబండారాలు, టికెట్స్ ధరలు, పార్కింగ్ దోపిడీని నియంత్రించాలని (PYL) నాయకులు డిమాండ్ చేశారు. సినిమా మాఫియా వల్ల సామాన్య ప్రజలు థియేటర్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, ఈ దోపిడీని అరికట్టకపోతే ఆందోళన చేస్తామని (PYL) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రవికుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ నాయకులు బంగారు శ్రీనివాస్, ప్రకాష్, రాజు, నరేష్, కొల్లూర్ శంకర్, V.సురేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలు తక్షణమే అమలు చేయాలి

**- సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ మేడ్చల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని 12 డిమాండ్ లతో కూడిన వినతి పత్రం కలెక్టర్ కు మంగళవారం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 వాగ్దానాలను నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. హామీలు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మల్లాపూర్ లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

**» హిందూ సంస్కృతి పరిరక్షణకు పిలుపు**




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వయం సేవకులు 100 సంవత్సరాలలో ఆర్ఎస్ఎస్ సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. విశ్వ మానవ శ్రేయస్సు కోసం ఏర్పడిన ఆర్ఎస్ఎస్ సంస్థ అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచి గెలిచిందని, భారత దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి హిందువేనని, హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటానికి ప్రతి ఒక్కరూ ముందుండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రాజు, అందే సత్యం, దువ్వ నవీన్, కొండ గణేష్, దురిశెట్టి రాజేశం, నాగ శ్రీనివాస్, మహేష్, అరిసెల శ్రీనివాస్, భాస్కర్, ఆడెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ శకలమై .. మనసు వికలమై

**» ఐటీ ఉద్యోగి ఆత్మహత్య**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



ఘట్కేసర్ లోని పోచారం ఐటీ కారిడార్ పరిధిలో సోమవారం రాత్రి సంస్కృతి టౌన్షిప్ లో నివాసముంటున్న ఇన్ఫోసిస్ సాఫ్ట్వేర్ ఉద్యోగి కుర్ర పవన్ కళ్యాణ్ రెడ్డి (26) ప్రేమ విఫలమైందని బెడ్ షీట్ తో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు సమాచారం అందించగా, తండ్రి శ్రీనివాసరెడ్డి ఎటువంటి అనుమానాలు లేవని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత ఆదేశించారు. మంగళవారం కోరుట్ల మండలంలోని జోగన్ పల్లి, రాయ్కల్ మండలంలోని మహితాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా ధాన్యం దిగుమతి అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ లో భారీ కొండచిలువ కలకలం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

ఘట్‌కేసర్‌లో భారీ కొండచిలువ కలకలం రేపింది. చిన్న చెరువు సమీపంలో కొండచిలువ సంచారం స్థానికుల్లో తీవ్ర భయాందోళన సృష్టించింది. నిత్యం జనం సంచరించే ఈ ప్రాంతంలో భారీ సర్పం కనిపించడంతో, ప్రజలు అటవీ శాఖ అధికారులను వెంటనే కొండచిలువను బంధించి జూ పార్కుకు తరలించాలని కోరారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ,నవంబర్25**

అమెరికా కరెన్సీ డాలర్ బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. భారత్‌లో కూడా బంగారం ధర చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నా కూడా రేట్స్‌లో కోత పడింది. దేశంలో మంగళవారం ఉదయం సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,120. నిన్నటి ధరతో పోలిస్తే రూ.463 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.650 మేర తగ్గి రూ.1,14,690కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. సోమవారం నాటి ధరతో పోలిస్తే ప్రస్తుతం వెండి రేటు రూ. వెయ్యి మేర తగ్గి రూ.1,62,900కు చేరింది. డాలర్ బలపడటంతో బంగారానికి డిమాండ్ కాస్త తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ సూచీ ప్రస్తుతం 100 మార్కుకు పైనే కదలాడుతోంది. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికం. దీంతో ఇన్వెస్టర్లకు కమోడిటీ మార్కెట్‌పై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం 70 శాతంగా ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రైతులు మిశ్రమ పంటలపై దృష్టి పెట్టాలి

**కరపత్రం ప్రతినిధి కర్నూలు,నవంబర్25**

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టి, అధిక దిగుబడులు పొందాలని పత్తికొండ ఏ డి ఏ మోహన్ విజయ్ కుమార్ అన్నారు. పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం అనే కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని లబ్ది గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్, రబీ సీజన్ లో కొర్ర, సజ్జ, మినుములు, చిరుధాన్యాలు మిశ్రమ పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు తెలియజేశారు. రైతులు సాగుచేసిన పంటలపై సూచనలు సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రియాజ్ భాష, శ్రీనాథ్, రైతు సేవా సిబ్బంది మాబు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శాలిబండ ఎలక్ట్రానిక్స్ షాపు అగ్నిప్రమాదం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,నవంబర్25**

శాలిబండ గోమతి ఎలక్ట్రానిక్స్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై మొగల్‌పురా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ సంచలన విషయాలు బయటపెట్టారు. రాత్రి 10:30 గంటలకు ఏదో పెద్ద బ్లాస్ట్ అయినట్టుగా ఒక్కసారిగా శబ్దం వినిపించిందని.. శబ్దం రావడంతో తన కారు పల్టీ కొట్టిందని తెలిపారు. కారుకు సంబంధించిన గ్లాస్ మొత్తం కూడా ధ్వంసం అయిపోయిందన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం..పాటించమని చెబుదాం..

-హెల్మెట్ ధరించని 10-మంది పోలీసులకు ఫైన్
-హెల్మెట్, సెట్ బెల్ట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయండి
-అతివేగం ఆనందాన్నివ్వొచ్చు కానీ, అదే వేగంతో ప్రమాదం కూడా రావొచ్చు
-ట్రాఫిక్ నిబంధనలు మన కుటుంబానికి రక్షా
-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డితో తన సిబ్బందితో కలిసి హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా విధులకు హాజరవుతున్న పోలీసు సిబ్బందికి ఫైన్ విధించడం విశేషం. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పోలీసులుగా మనం పాటించి, ఇతరులకు చెప్పాలన్నారు. ఇటీవలి కాలంలో అనేక మంది పోలీసులు హెల్మెట్ ధరించక రోడ్డు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తుచేశారు. ఒక చిన్న తప్పిదం కుటుంబాన్ని రోడ్డున పడేసే పరిస్థితి తెస్తుందని, హెల్మెట్ తలకు మాత్రమే కాదు, మొత్తం కుటుంబానికే రక్షణ ఇస్తుందన్నారు. కావున విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచనలు చేశారు.
జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వాహనాదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్, సీట్ బ్లెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని ఆయన అన్నారు. అతివేగం ఆనందాన్నివ్వొచ్చు కానీ, అదే వేగంతో ప్రమాదానికి దారి తీయవచ్చన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే సంబంధిత వాహన యజమానులు.. తల్లిదండ్రులపై చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.

# మల్లన్న పల్లి గ్రామ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తా..

- కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గంధం రవీందర్



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట నవంబర్ 25**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్లన్న పల్లె గ్రామానికి చెందిన సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తానని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పిస్తున్నారని అధికార కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గంధం రవీందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ
తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి చేస్తున్న పనులను చూసైనా , ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు యువనాయకత్వాన్ని బలపరిచి గెలిపించినట్లయితే గ్రామ సమస్యలు పరిష్కారం అవుతాయని, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆశీస్సులతో పార్టీ తరఫున మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, నన్ను గెలిపించినట్లయితే గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని మల్లన్న పల్లె ప్రజలను కోరారు

# ఆడబిడ్డలకు ప్రజా ప్రభుత్వం సారే

- ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం




**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట నవంబర్ 25**
ఇల్లందకుంట మండలంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.
హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు, ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ కార్యక్రమంలో పాల్గొని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.
**ఈ సందర్భంగా పెద్ది కుమార్ మాట్లాడుతూ**
తెలంగాణ ప్రభుత్వం మహిళల శ్రేయస్సు కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నదని తెలిపారు.
ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చీరల పంపిణీ సకాలంలో జరుగుతుందని చెప్పారు.
మహిళలకు అవసరమైన వడ్డీ లేని రుణాలు, ఇంధిరా మహిళా శక్తి పథకం ద్వారా లభించే పెట్రోల్ బంకులు, విద్యా సహాయం, ఆరోగ్య బీమా, మహిళా శక్తి కాంటీన్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణ సహాయం, ఇందిరమ్మ ఇళ్లు, వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యతలేనివని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న చీరలు ఉపయోగకరంగా, ప్రతి మహిళ సగౌరవంగా ధరించగల నాణ్యతతో ఉన్నాయని తెలిపారు.
"మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రామాణిక ధ్యేయం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధి, సంక్షేమం కొనసాగించాలని" మహిళలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో :- ఏపీఎం రాచపల్లి స్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు:- కనుమల్ల సంపత్, పెద్ది శివకుమార్, గోలి కిరణ్, మీస రాజయ్య, మంకు ఐలయ్య, భోగం పృథ్వి, గుండారపు సాయి, గంగారపు మహేష్, పైడిపల్లి దేవేందర్, మారపెల్లి వంశీ, మారపెల్లి సదయ్య, జాక్కు కుమార్, రేణికుంట్ల రవీందర్, కారోబార్ కొత్తూరు కుమార్, వీవోఏలు ఏ కవిత, పి శారద, ఆర్ రజిత, ఆర్ రాధిక, సీసీలు మొగిలి, జనార్ధన్, శ్రీనివాస్, వీవోవోబీలు షహనాజ్, భవాని, హరిప్రియ, జ్యోతి, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జమ్మికుంట వాసవి క్లబ్ సభ్యుడు అయితు రమేష్ బాబు మృతి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 25**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి చెందిన అయితే రమేష్ బాబు (ములకనుర్ పాలు డీలర్) స్వర్గస్తులైనారు కావున వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు మహా ప్రస్థానం తక్షణ సాయం కింద రూ??25000 రావడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి డి ఐ ఎస్ టీ వి 107 ఏ గవర్నర్ ఇల్లందుల కిషోర్ కుమార్ ఈ కార్యక్రమానికి మధ్యాన్నం గం,, 3:00 లకు హాజరై వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరుగుతుంది కాబట్టి మన వాసవి క్లబ్ సభ్యులందరు పాల్గొని అయితు రమేష్ బాబు కి ఘన నివాళిఅర్పించాలనికోరుతున్నాము వాసవిమాత సేవలో వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారి తదితరులు పాల్గొన్నారు

# గిరిజన గురుకుల కళాశాల విద్యార్థినీలకు గీజర్ సౌకర్యం



- ప్రాజెక్టు రెస్క్యూ ఫౌండేషన్ ఔదర్యం

**కరపత్రం ప్రతినిధి మంథని, నవంబర్ 25 :**
మంథని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థినిలకు చలికాలం దృష్ట్యా గీజర్ సౌకర్యం కల్పించి ప్రాజెక్టు రెస్క్యూ ఫౌండేషన్ ఇండియా ఔదార్యం చాటుకున్నారు. మంగళవారం అమ్మ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గిరిజన గురుకుల ఆశ్రమ కళాశాల ఉపాధ్యాయులకు గీజర్ అందజేశారు. ఇటీవల అమ్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు గిరిజన ఆశ్రమ కళాశాలలో నిర్వహించగా విద్యార్థినిలు గీజర్ లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రాజెక్టు రెస్క్యూ ఫౌండేషన్ ఇండియా డాక్టర్ మాథ్యూ డేనియల్ దృష్టికి తీసుకురావడంతో విద్యార్థుల సౌకర్యార్థం గీజర్ మంజూరు చేసి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ అమ్మ ఆనంద్ కుమార్, గిరిజన గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపల్ అరుణ, లెక్చరర్స్ శ్రీలత, రజిత, విశ్వశాంతి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన పెరిక కుల రాష్ట్ర నాయకులు

- రాష్ట్ర కమిటీని అభినందించిన మంత్రులు




**కరపత్రం ప్రతినిధి -హైదరాబాద్:**
ఇటీవల తెలంగాణ రాష్ట్ర పెరిక (పురగిరి క్షత్రియ) కుల రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన యర్రంశెట్టి ముత్తయ్య నాయకత్వంలో మంగళవారం హైదరాబాద్ లో రాష్ట్ర రోడ్డు రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్క లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి ముత్తయ్య వారి రాష్ట్ర కమిటీ నాయకులకు మంత్రులు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. నానాటికి మారుతున్న పరిస్థితుల్లో వివిధ రంగాల్లో పెరిక కులస్థుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా సహాయం అందించాలని, స్థానిక సంస్థల్లో పెరిక కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని, ప్రభుత్వ పరంగా ఇచ్చే నామినేటెడ్ పదవుల్లో పెరిక కులస్తులకు అవకాశాలు కల్పించాలని వారు మంత్రులను విజ్ఞప్తి చేశారు. ఉత్పత్తి, శ్రమలో కీలకపాత్ర పోషించడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో స్వయం కృషితో రాణిస్తున్న పెరిక కులస్తులు రాజకీయాల్లో కూడా చురుకుగా ఉన్నారని అలాంటి పెరిక కులస్థుల అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రభుత్వం తరపునుండి, పార్టీ నుండి సహకారం అందిస్తామని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ధనేకుల కృష్ణ, ముఖ్య సలహాదారులు చింతం లక్ష్మీనారాయణ, డాక్టర్ సంగని మల్లేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కోట మల్లికార్జున్, ఆక రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రంగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకత మల్లికార్జునరావు, ఆర్థిక కార్యదర్శి బోడకుంటి సుధాకర్, అధికార ప్రతినిధి సాయిని నరేందర్, రాష్ట్ర నాయకులు అంకత ఉమామహేశ్వర్ రావు, బుయ్యాని శివకుమార్, శ్రీధర్ల జగదీశ్వర్, గంప నాగరాజు, యర్రంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ప్రశాంతతే ముఖ్యం వన్నెస్ ట్రైనర్ అంజనీ

**కరపత్రం ప్రతినిధి మంథని నవంబర్ 25**

మనిషి జీవితంలో మానసిక ప్రశాంతతే అన్నింటికంటే ముఖ్యమైందని వన్నెస్ ట్రైనర్, మంథని అగ్రికల్చర్ ఏడి అంజనీ అన్నారు. మంగళవారం మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ నేటి సమాజంలో యువత తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. . తమ జీవితంలో తీసుకునే నిర్ణయాల్లో ఏర్పడే గందరగోళంతోనే ఇలాంటి పరిస్థితి ఉంటుందన్నారు. ఎప్పుడైతే మానసికంగా ప్రశాంతత అలవాటు అవుతుందో అప్పుడు తాము తీసుకున్న నిర్ణయం పై ఓ అంచనా ఉంటుందన్నారు.ఆవేశంలో తీసుకుని నిర్ణయాలు ఇబ్బందులకు దారి తీస్తాయన్నారు తల్లిదండ్రులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారిని ఇబ్బందులు గురి చేసే విధంగా ప్రవర్తించవద్దన్నారు. నిత్యం సాధన ద్వారా మనసును అదుపులో ఉంచే విధంగా ప్రాక్టీస్ చేయాలన్నారు. ఎంత పెద్ద సమస్యనైనా వెల్నెస్ ట్రీట్మెంట్ ద్వారా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. కృతజ్ఞత అనేది ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని తమకు సహకరించిన ప్రతి ఒక్కరి పట్ల అదే భావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సయ్యద్ సలీం, స్టూడెంట్ కౌన్సిలర్ ఎల్ ఆర్ కే రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గొర్రెకల్ గ్రామంలో 'ఇందిరా మహిళ శక్తి' చీరల పంపిణీ

-బోయిని సత్యం

**కరపత్రం ప్రతినిధి అందోలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య%-%ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు వట్పల్లి మండలంలో 'ఇందిరా మహిళ శక్తి' చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బోయిని సత్యం ఆధ్వర్యంలో గొర్రెకల్ గ్రామంలోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు చీరలను అందజేశారు.
ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు, సభ్యులు, మరియు కృష్ణ గౌడ్, సుధాకర్, శ్రీకాంత్, దాసు, రవి, చాకలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అందరికీ చేరాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.

# అధికారులను సస్పెండ్ చేయాలి

- ఖనిలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 25:**

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్ల ప్రొటోకాల్ పాటించని అధికారులను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ లీడర్ కామ విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయ్ ఆధ్వర్యంలో గోదావరిఖని మున్సిపల్ తీన్ రస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగంలో చట్టాలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధికి కనీసం ప్రొటోకాల్ పాటించకపోవడం పెద్ద నేరమని ఆయన అన్నారు. ఎంపీ వంశీకృష్ణ విషయంలో పదేపదే ప్రొటోకాల్ ఎందుకు తప్పుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకమీదట ఎంపీ వంశీకృష్ణను చిన్నచూపు చేస్తూ సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కాక వెంకట స్వామి కుటుంబం పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, అలాంటి కుటుంబం పట్ల వివక్ష తగదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్లు తిప్పారపు మధు, జావెద్, ముచ్చకుర్తి మహేష్, శ్రావణ్, శేఖర్, శ్రీకాంత్, సర్దార్, అల్తాఫ్, వినోద్, రవి, రాజ్మహ్మద్, దినేష్, శ్రీనివాస్, విజయ్, రాజు, చరణ్, తదితరులు పాల్గొన్నారు.